
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప జిల్లా వార్తలు

5

శుక్రవారం 12 సెప్టెంబరు 2025





కడప జలమయం

● చెరువులను తలపిస్తున్న రోడ్లు ● ఇళ్లలోకి చేరిన వరదనీరు ● రాకపోకలకు తీవ్ర అంతరాయం

వారం రోజులుగా తీవ్ర ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన జనం ఆశ్చర్యపోయేలా.. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంటపొలాలు నీటమునిగాయి. కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వాగులు వంకలు పొంగి రోడ్లపై ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఏది ఏమైనా రబీ ఆరంభానికి ముందు భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో వరుణుడు ప్రతాపం చూపించాడు. మొన్నటి వరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం కొంచెం ఉపశమనం కలిగించింది. అయితే కొన్ని ప్రాంతాలు మాత్రం పూర్తిగా జలమయ్యాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. కడపలో 8 గంటల వ్యవధిలో 66.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీనితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలకు, కాలనీలకు వరదనీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. పలు వీధుల్లో ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరింది. అప్సర సరికల్, ఆర్టీసీ బస్టాండ్, హోమియోపతి కళాశాల రోడ్డు, జైనగర్ కాలనీ, గంజికుంట కాలనీ, రిమ్స్‌లో భారీగా వరద నీరుచేరింది. పెద్ద దర్గా సమీపంలో గల కటిక వీధిలో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షాలు పడిన ప్రతిసారీ తాము ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



కడప నగరంలో జలమయమైన రోడ్లు

జమ్మలమడుగులో బస్సులు రద్దు

జమ్మలమడుగు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి పొద్దుపోయాక ఒక్కసారిగా మొదలై గురువారం ఉదయం 7 గంటలదాకా ఎడతెరపి లేకుండా కురిసింది. దీంతో రైతుల్లో సంతోషం వ్యక్తమైంది. జమ్మలమడుగులోని లోతట్టు ప్రాంతాలు, పొలాల్లో భారీగా వర్షపునీరు నిలిచింది. పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో ఎల్ఎంసీ కాంపౌండ్ నందు, మోరగుడిలోని తాడిపత్రి రోడ్డు ఆంజనేయస్వామి గుడి వద్ద వర్షపునీరు రోడ్డుపై ప్రవహించింది. ఒక్కసారిగా భారీగా వర్షం కురవడంతో ఎస్.ఉప్పలపాడు గ్రామ శివార్లలో అలుగోగు వంక వద్ద రోడ్డుపై నీరు ప్రవహించి కోతకు గురి కావడంతో ఈ మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల వైపు నుంచి అలాగే కర్నూలు వైపు నుంచి జమ్మలమడుగు మీదుగా ప్రొద్దుటూరు వెళ్లే సర్వీసులన్నీ రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొందరు అత్యవసరమైన వారు జమ్మలమడుగు ఆర్డినరీ, నాన్‌స్టాప్ సర్వీసుల్లో ప్రొద్దుటూరు, అక్కడి నుంచి మైదుకూరు, ఆళ్లగడ్డవైపు ప్రయాణం చేశారు. జమ్మలమడుగు నుంచి తాడిపత్రి వైపు వెళ్లే సర్వీసులు రద్దు చేశారు. నంద్యాల జిల్లా కల్వటాల వద్ద బస్సులు వెళ్లడానికి రోడ్డుపై వర్షపునీరు భారీ ప్రవాహం వలన సర్వీసులు రద్దు చేశారు. అనంతపురం నుంచి తాడిపత్రి, జమ్మలమడుగు మీదుగా బద్వేలు వైపు వెళ్లే బస్సులన్నీ రద్దు చేశారు. కోతకు గురైన అలుగోగు వంక రోడ్డుకు ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన వారు మరమ్మతులు చేపట్టారు. జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి అలుగోగు వంక వద్దకు పరిశీలించారు.



జమ్మలమడుగులో తాడిపత్రి వైపు కల్వటాల వద్ద రోడ్డుపై నీరు రావడంతో ఆగిన రాకపోకలు



జమ్మలమడుగు ఎస్.ఉప్పలపాడు అలుగోగు వంక వద్ద కోతకు గురైన రోడ్డు

కొండాపురంలో పొంగిన వాగులు

కొండాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురవాఆరం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో పలుచోట్ల వాగులు, వంకలు పొర్లి ప్రవహించాయి. పొట్టిపాడు-బెడుదూరు గ్రామాల మధ్యలో మూడు అడుగుల లోతు మేర వర్షపు నీరు ప్రవహించినట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. కొన్ని రోజలుగా ఉక్కపోతకు అల్లాడుతున్న ప్రజలు వర్షం రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వల్ల బోర్లలో నీరు పెరుగుతుందని రైతులు భావిస్తున్నారు.



కొండాపురం మండలం పొట్టిపాడు-బెడుదూరు రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రాజుపాలెంలో దెబ్బతిన్న జొన్న, కంది



రాజుపాళెం మండలంలో మొలక దశలోనే వర్షంతో దెబ్బతిన్న జొన్న

రాజుపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 11గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో 50.1 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నాలుగురోజుల క్రితం వేసిన జొన్నపంట మొలకదశలోనే వర్షం నీరు పారడంతో కుళ్లిపోతుందని, కందిపంట కూడా దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. మినుము, శెనగ, జొన్న సాగు చేసుకునేందుకు వీలుగా వాన పడిందని అంటున్నారు. ఖరీఫ్‌లో సాగైన వరి, మొక్కజొన్న, మిరప, పసుపు పంటలకు ఈ వర్షపాతం మంచి దిగుబడినిచ్చేందుకు ఉపయోగపడుతుంది. ఈ ఏడాదికి ఇదే మంచి వర్షపాతమని రైతులు తెలిపారు.



రాజుపాళెం మండలంలో కంది పంటలో నిలిచిన నీళ్లు

ప్రతి గ్రామానికి మంచినీరివ్వాలి

● జడ్పీ సీఈవో ఓబులమ్మ



కడప రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సీపీడబ్ల్యూఎస్ స్కీంల ద్వారా వాటి పరిధిలోని ప్రజలకు సురక్షితమైన మంచినీటిని ప్రతి గ్రామానికి సరఫరా చేయాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో సిపిడబ్ల్యుఎస్ స్కీంల పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఆయా స్కీం పరిధిలో ఎన్ని గ్రామాలుంటే అన్ని గ్రామాల ప్రజలకు నీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలన్నారు. జడ్పీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో ముందుకు సాగి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం కనబరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ఇన్‌చార్జ్ ఎస్ఈ ఏడుకొండలు, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఈఈలు, డిఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

జగన్‌ది విషప్రచారం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్క పల్లె, సెప్టెం బరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని చులకన చేయాలనే లక్ష్యంతో జగన్ విషప్రచారం చేస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం ద్వారకనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ వార్నింగ్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి వ్యక్తిని ఎక్కడా చూడలేదన్నారు. ప్రభుత్వ నిర్ణయం నచ్చకుంటే కోర్టు లో సవాలు చేయాలి లేదా కేసు వేయాలి అంతేతప్ప నా ప్రభుత్వం వస్తే రద్దు చేస్తామంటూ వార్నింగ్ ఇవ్వడం ఎంతవరకు సమం జసం అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలు చిత్తుగా ఓడించిన తర్వాత కూడా ఇలా మాట్లాడడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వ్యక్తులు రాజకీయంలో ఉండడం అతి ప్రమాదకరమన్నారు. పులివెందులలో నిన్న కాక మొన్న చిత్తుగా ఓడించినా తన వ్యవహా రశైలిలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు విష ప్రచారం చేస్తున్న జగన్‌పై రాజద్రోహం కేసు నమోదుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

100 మందికి పదోన్నతులు

కడప రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 100 మంది గేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు వారికి కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ అనుమతితో డీపీవో రాజ్యలక్ష్మి నేతృత్వంలోని కమిటీ సభ్యులు సయ్యద్ ఖాదర్ బాషా(ఏవో), ఎజాజ్ అహమ్మద్, జోయల్ దివాకర్, మాధవీరెడ్డి గురువారం గ్రేడ్-5 కార్యదర్శులకు డీపీవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి జాబితాను సిద్ధం చేశారు. కలెక్టర్ నుంచి అనుమతి రాగానే వీరికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

యూరియా నిల్వలు, అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే లైసెన్స్ రద్దు

● జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

పులివెందుల రూరల్ / కడప రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా నిల్వలు, అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే ఎరువుల దుకాణదారుని లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ హెచ్చరించారు. గురువారం పులివెందుల పట్టణంలోని ఎరువుల దుకాణాలను పరిశీలించి నిల్వలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు అమ్మడంపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు బుధవారం 1100 టన్నుల యూరియా, గురువారం 900 టన్నుల యూరియా వచ్చిందన్నారు. వచ్చిన యూరియాను రైతు సేవాకేంద్రాలకు 1000 టన్నులు అలాగే మరో 1000 టన్నుల యూరియాను ప్రైవేట్ ఎరువుల దుకాణదారులకు కేటాయించామన్నారు. మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయాధికారి సునిల్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మరో 1315 మెట్రిక్ టన్నులు రాక

గురువారం కడప రైల్వేస్టేషన్‌కు 1315 టన్నుల యూరియా ఎరువులు వచ్చాయి. ఇందులో కడప జిల్లాకు 900 టన్నులు రాగా వాటిలో 300 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 205 టన్నులు ఎంజీసీఎస్ కంపెనీకి, 395 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అన్నమయ్య జిల్లాకు 415 టన్నులు రాగా వాటిలో ప్రైవేట్ డీలర్లకు 29 టన్నులు, ఎంజీసీఎస్ కంపెనీకి 58, మార్క్‌ఫెడ్‌కు 328 టన్నులు పంపిణీ చేశారు.

నారా లోకేశ్‌కు రుణపడి ఉంటాం

● వీడియో కాల్‌లో మాతో మాట్లాడారు
● క్షేమంగా ఇళ్లకు చేర్చారు
● నేపాల్ బాధితులు



రేణిగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశం ఖాట్మండులో చిక్కుకున్న తమతో వీడియోకాల్ ద్వారా మాట్లాడుతూ అనుక్షణం తమ యోగక్షేమాలు మంత్రి నారా లోకేశ్ కనుక్కున్నారని, అలాగే స్వస్థలానికి వచ్చేందుకు సహకరించిన ఆయనకు రుణపడి ఉంటామని బాధితులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి నేపాల్‌లోని ఖాట్మండుకు ఈ నెల 7, 8 తేదీలలో పశుపతినాథ్ మందిర్ టూర్‌కు వెళ్లామన్నారు. దర్శనం అనంతరం మరో మూడు రోజులు చుట్టుపక్కల ప్రాంతాలను వీక్షించేందుకు సిద్ధమవుతుండగా ఖాట్మండులో అనుకోకుండా రాజకీయ సంక్షోభం ఏర్పడడంతో, ప్రజలు ఒక్కసారిగా ప్రభుత్వంపై తిరగబడ్డారన్నారు. దీంతో తాము బయటకు రావాలన్నా భయాందోళన పరిస్థితి నెలకొందన్నారు. ఏమి చేయాలో తెలియని పరిస్థితిల్లో తమ పరిస్థితి గుర్తించి అత్యధికంగా ఉన్న రాయలసీమ జిల్లాలకు చెందిన బాధితులతో అనుక్షణం వీడియో కాల్ చేస్తూ తమ యోగక్షేమాలు కనుక్కుంటూ ధైర్యం నింపి గమ్యస్థానానికి చేర్చిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రుణపడి ఉంటామని ఆనందభాష్పాలతో తెలిపారు. గురువారం రాత్రి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న బాధితులు మీడియాతో మాట్లాడారు. బాధితులకు స్వాగతం పలికేందుకు తిరుపతి విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయంలో దిగిన బాధితులకు భోజనాలు ఏర్పాటు చేయడమే కాకుండా గమ్యస్థానాలకు చేరేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. బాధితులకు విమానాశ్రయంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. వీరు జిల్లా వాసులను దగ్గరుండి బస్సులో కడపకు పంపించారు.

రెండు రోజులు హోటళ్లకే పరిమితం



ఒకటో తేదీ నేపాల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు స్నేహితులు కలిసి 8 మంది టూర్‌కి వెళ్లాము. అన్నీ చూసుకున్న అనంతరం ఇండియాకు వచ్చే క్రమంలో మా బస్సుపై దాడి చేయడంతో రెండు రోజులు హోటళ్లకే పరిమితమయ్యాం. విషయం తెలుసుకున్న కూటమి ప్రభుత్వం మమ్మల్ని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చింది. దనికి సహకరించిన మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం.

- రాజేశ్వరి కడప

గమ్యస్థానాలకు చేర్చారు



సరదాగా కుటుంబ సభ్యులతో నేపాల్‌కి వెళ్లిన మాకు అక్కడ అనుకోని పరిస్థితులు ఎదురయ్యి హోటళ్లకే పరిమితమయ్యాం. ఎలా బయటపడాలో అర్థం కాని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మా అందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గమ్యస్థానాలకు చేర్చింది. కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు.

- అపర్ణాదేవి, కడప

తండ్రికి మించిన తనయుడు



నేపాల్‌కు కుటుంబ సభ్యులతో పాటు బంధువులతో కలిసి టూర్ వెళ్లగా సగంలోనే ఆ ప్రాంతంలో సివిల్ వార్ ఏర్పడింది. మేము ప్రయాణిస్తున్న బస్సులపై స్థానిక యువకులు రాళ్లదాడి చేశారు. డ్రైవర్ గుర్తించి బస్సును ఎక్కడా ఆపకుండా హోటల్‌కు చేర్చడంతో మా ప్రాణాలు దక్కాయి. ముందు పోతున్న బస్సుల్లో ఆందోళనకారులు ప్రయాణికుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో దోపిడీ చేశారు. కూటమి ప్రభుత్వం తరఫున రాష్ట్ర సెక్రెటరీ కార్యాలయం, సచివాలయం నుంచి మాకు ఫోన్లు చేసి ఆధార్ కార్డులను అప్లోడ్ చేశారు. క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చిన మంత్రి నారా లోకేశ్ తండ్రికి మించిన తనయుడు.

- వెంకటేశ్వర్, కడప

నేటితో 134 ఏళ్లు..!

● 12 సెప్టెంబరు 1902న ఘోర రైలు ప్రమాదం
● ఆంగ్లో-ఇండియన్ థెరిస్సా 'డి' లీమాతో పాటు 71మంది మృతి

ముద్దనూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అది బ్రిటీష్ కాలంలో జరిగిన ఘోర రైలు ప్రమాదం. ఈ ప్రమాదంలో 71మంది చనిపోయారు. ఈ రైలు ప్రమాదం జరిగి సరిగ్గా శుక్రవారం నాటికి 134 సంవత్సరాలు.

బ్రిటీష్ పాలనలో మద్రాసు, ముంబై ప్రధాన కేంద్రాలుగా దేశమంతా వర్తక వ్యాపారాలు సాగించేవారు. దీనికోసం బ్రిటీష్ వారు రైలు ప్రయాణాలు చేసేవారు. ఇందుకోసం రైలు మార్గాలనూ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 1902 సెప్టెంబరులో మద్రాసు నుంచి ముంబైకి మెయిల్ రైలు ప్రయాణికులతో బయలుదేరింది. సెప్టంబరు 12వ తేదీ మంగపట్నం రైల్వే స్టేషన్ చేరుకుంది. అది వర్షాకాలం. వరద నీరు రావడంతో బ్రిడ్జి పూర్తిగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. అది తెలియక రైలును ఆ మార్గంలో నడిపారు. దీంతో రైలు ప్రమాదానికి గురై 10 మంది యురోపియన్లు, 61మంది హిందూ, ముస్లింలు మృతిచెందారు. వీరందరినీ అక్కడే పెద్ద గొయ్యి తీసి ఖననం చేశారు. ఆ రైలు ప్రమాదానికి గుర్తుగా స్థూపాన్ని, శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆ రైలు ప్రమాదంలో బెంగళూరు కార్మెలైట్ సిస్టర్స్ ఆఫ్ థెరిసా సంస్థ వ్యవస్థాపకురాలు మదర్ థెరిస్సా 'డి' లీమా (లీమాపురి రోజమ్మ) మృతి చెందారు.



థెరిస్సా డి లీమా (ఫైల్ ఫొటో)



రైలు ప్రమాదం జరిగిన చోట ఏర్పాటు చేసిన స్థూపం

థెరిస్సా 'డి' లీమా మద్రాసులో పుట్టి..

థెరిస్సా 'డి' లీమా ఆంగ్లో-ఇండియన్. ఆమె మద్రాసులో 1858 జనవరి 29 జన్మించారు. తల్లిదండ్రులు మేరీ డి లీమా, పీటర్. ఆమె పిన్నవయసులోనే తల్లి మరణించింది. తండ్రికి ఆమె అంటే ఎనలేని ప్రేమ. మద్రాసులోని ప్రెజెంటేషన్ కాన్వెంట్ స్కూల్‌లో విద్యనభ్యసించారు. తరువాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. థెరిస్సా డి లీమా మేరీమాత భక్తురాలు. కేరళ ఉపాధ్యాయుల కోరిక మేరకు ఆమె కేరళ అలపిలో ఫాదర్స్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. ఒక పాఠశాలను ప్రారంభించి అనాథ, పేదకూలీ పిల్లలకు ఉచితంగా విద్య అందించారు. కొందరు సిస్టర్లతో బెంగళూరులో కార్మెలైట్ సిస్టర్స్ ఆఫ్ థెరిస్సా (సీఎస్ఎస్‌టీ)సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో మన దేశంలో 500 పాఠశాలలు నడుస్తున్నాయి. విదేశాలలోనూ పాఠశాలలు ఉన్నాయి. 2003 సంవత్సరంలో ఆమె స్మారకార్థం మంగపట్నం గ్రామం వద్ద కార్మెలైట్ సిస్టర్స్ అక్కడ థెరిస్సా 'డి' లీమా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేశారని ప్రధానోపాధ్యాయురాలు రిశిక, మేనేజర్ రీని తెలిపారు. కాగా.. రైలు ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నామని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

అతిగా వాడితే అనర్థమే..!

- సమతుల్య ఎరువుల వాడకం కీలకం
- అతిగా యూరియా వాడకంతో దెబ్బతింటున్న భూసారం
- ఎరువుల అతి వినియోగంతో ఆర్థిక భారం
- సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి



వరిలో కలుపు తీస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన అధిక దిగుబడులకు సమతుల్య ఎరువుల వాడకం కీలకం. ఎంత ఎరువు వాడితే పంటకు అంత బలం అనే అపోహ చాలామంది రైతుల్లో ఉంది. మోతాదుకు మించి ఎరువులు, పురుగుల మందుల వాడకం పంటలకు బలం కాదు.. భూసారాన్ని తగ్గించేసి దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వరి. అవసరం మేరకు విడతల వారీగా ఎరువులు తీసుకోవడం కాకుండా ఒకేసారి సమీకరించుకోవాలనే తాపత్రయం, వ్యాపారుల లాభాపేక్ష వెరసి యూరియా కొరతకు కారణమవుతోంది. మన పూర్వీకులు పొలం గట్లపై ఉండే కానుగ, వేప, జిల్లేడు, వెంపలి, అవిశ చెట్ల పచ్చి ఆకు కొట్టి తెచ్చి కలియ దున్నడం, పశువుల ఎరువు వంటి సహజ వనరులపై ఆధారపడేవారు. దురదృష్టవశాత్తు తగినంత పశువుల ఎరువు అందుబాటులో లేనందున రైతులు కృత్రిమ ఎరువులు ప్రధానంగా యూరియాపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలలో సమతుల్య ఎరువుల వినియోగం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రధానంగా నత్రజని అందించే యూరియా సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యం.

అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల భూసారం క్రమంగా తగ్గిపోతుంది. భూగర్భ జలాలు, నీటి వాగులు కలుషితం అవుతాయి. పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుంది. సాగు ఖర్చులు పెరిగి లాభం తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

యూరియా తగ్గించే ప్రత్యామ్నాయాలు

పశువుల ఎరువు, వర్మీ కంపోస్టుతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పొలం గట్టపై ఉండే కానుగ, వేప, ఆవిశ చెట్ల పచ్చి ఆకులు వేసి కలియ దున్నడం, సీజను వర్షానికి ముందు పొడి విత్తనాలు చల్లడం, పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం, పంట అవశేషాలను కలియ దున్నడం ద్వారా తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా నత్రజనిని పంటకు అందించవచ్చు. అలాగే జీవన ఎరువులైన అజటో బ్యాక్టర్, అజోస్పరిల్లం, రైజోబియం వినియోగించడం వలన పంటలకు తక్కువ ఖర్చుతో నత్రజని లభ్యత, భూసారం పెంచవచ్చు. ఈ విధానం ద్వారా 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా చేయవచ్చు.

కొత్త తరహా ఎరువుల వాడకం....

నానో యూరియాను పైపాటుగా పంట కాలంలో రెండు మూడు దఫాలుగా పిచికారీ చేయడం వలన 80 శాతం నత్రజని లభ్యత పెంచడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూ దిగుబడిలో ఎటువంటి తగ్గుదల ఉండదు.

పీలేరులో ఖరీఫ్ సాగు...

నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వరి, వేరుశనగ పంటల సాగు విస్తీర్ణం హెక్టార్లలో ఇలా ఉన్నాయి. పీలేరు మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 355 హెక్టార్లకు గాను 180 హెక్టార్లలో సాగు చేశారు. వేరుశనగ 1826.8 హెక్టార్లకు గాను 210 హెక్టార్లలో సాగు చేశారు. కేవీ పల్లె మండలంలో వరి 370 హెక్టార్లకు 120 హెక్టార్లు, వేరుశనగ 2619 హెక్టార్లకు కేవలం 172 హెక్టార్లలో సాగు చేశారు. వాల్మీకిపురం మండలంలో వరి 578 హెక్టార్లకు గాను 2.33, వేరుశనగ 1392 హెక్టార్లకు 86.62 హెక్టార్లలో సాగు చేశారు.

గుర్రంకొండ మండలంలో వరి 343 హెక్టార్లకు 39.07, వేరుశనగ 916 హెక్టార్లకు గాను 35.83 హెక్టార్లలో సాగు చేశారు. కలికిరి మండలంలో వరి 416 హెక్టార్లకు గాను 75.72, వేరుశనగ 1100 హెక్టార్లకు 52.33 హెక్టార్లలో సాగు చేశారు. కలకడ మండలంలో వరి 229 హెక్టార్లకు 22.77, వేరుశనగ 986 హెక్టార్లకు 44.14 హెక్టార్లలో సాగు చేశారు. ఇవి కాక అరకొరగా కూరగాయలు, టమోటా, బొప్పాయి, పశుగ్రాసం రైతులు సాగు చేశారు.

వరి ఎకరాకు వేయాల్సిన ఎరువులు...

ఒక ఎకరా వరి పంట సాగు చేస్తే రైతులు 75 కిలోల యూరియాను మూడు దఫాలు సమాన మోతాదులో పిచికారీ చేయాలి. డీఏపీ, గ్రోమోర్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 40 కిలోలు ఒకసారి మాత్రమే వేయాలి. పొటాష్ 30 కిలోలు దమ్ములో 15 కేజీలు, చిరు పొట్ట దశలో 15 కిలోలకు వాడాలి. అయితే వాటికి రెండు, మూడింతలు ఎరువులు వినియోగిస్తున్నట్లు అధికారులు, శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అధిక మొత్తంలో ఎరువుల వాడకం పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

వరి పంటకు మేలు కంటే కీడే ఎక్కువ....



రసాయన ఎరువుల వినియోగం వరి పంటకు మేలు కంటే కీడు ఎక్కువ చేస్తుంది. ఎరువుల అతి వినియోగంతో ఆర్థిక భారమే కాకుండా తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గే అవకాశముంది. భూసారం దెబ్బతింటుంది. కొందరు రైతులు సహజసిద్ధ పద్ధతుల్లో కషాయాల వినియోగంతో పెట్టుబడులు తగ్గించుకోవడమే కాకుండా భూసారాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. యూరియా అధిక మోతాదులో వాడకం వల్ల అనేక నష్టాలను చవిచూసే ప్రమాదం ఉంది. నత్రజని అందించే యూరియా ఎరువు సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యం.

- వైవీ రమణారావు, ఏడీఏ, పీలేరు.

ఎకరాకు రూ.35 వేలకు పైగా ఖర్చు



ఒక ఎకరా వరి పంట సాగుకు రూ.35 వేలకు పైగా ఖర్చు వస్తోంది. సకాలంలో ఎరువులు, కలుపు తీత తదితర పనులు పూర్తి చేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దిగుబడి ఉంటుంది. అయితే అనేక కష్టనష్టాలకు ఓర్చి పంట చేతికందే సమయానికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యూరియా కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రైతుల ఇక్కట్లు గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- చిన్నయల్లప్ప, రైతు, కురవపల్లె, పీలేరు మండలం.

ప్రభుత్వ భూములు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం రెడ్డికోటకు సమీపంలోని పర్లగోళ్లపల్లె వద్ద ఏపీఐఐసీకి కేటాయించిన ప్రభుత్వ భూములను గురువారం సబ్‌కలెక్టరు చల్లా కళ్యాణి అధికారులతో కలసి పరిశీలించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి గతంలో రెడ్డికోట వద్ద 20 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే రోడ్డున పడతామని స్థానిక రైతులు సబ్‌కలెక్టరు ఎదుట వాపోయారు. స్పందించిన సబ్‌కలెక్టరు బాధిత రైతుల వద్ద ఉన్న భూమి పాసుపుస్తకాలను పరిశీలించారు. భూమికి సంబంధించి రైతుల వద్ద ఉన్న ఆధారాలు (భూమి పాసుపుస్తకాలు, ఇతర రికార్డులు), తమ వద్ద (రెవెన్యూ కార్యాలయంలో) ఉన్న రెవెన్యూ రికార్డులు తీసుకుని మదనపల్లెలోని కార్యాలయానికి రావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ధనుంజయులు, మండల సర్వేయరు నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు



స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గాలివీడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి యూరియాను వాడరాదని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామంలో డీపీఎం వెంకటమోహన్‌తో కలిసి యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని, భూమి సారవంతాన్ని పెంచి అధిక దిగుబడులు ఇచ్చేలా ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అనంతరం యూరియా స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో నవంత్, మండల వ్యవసాయ అధికారిణి గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

లోను ఇప్పిస్తామని నమ్మించి మహిళపై దాడి

బంగారు నగల అపహరణ



గాయపడిన రమాదేవి

పుల్లంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళకు లోను ఇప్పిస్తామని నమ్మించి ఆపై దాడి చేసి బంగారు నగలతో ఉడాయించిన ఘటన మండలంలోని వత్తలూరు పంచాయతీలో జరిగింది. పుల్లంపేట ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన ఏరుకాలువ రమాదేవి (56) రాజంపేటలో నివాసం ఉంటోంది. ఈమె భర్త, కుమారుడు కువైత్‌లో ఉన్నారు. ఒక కుమార్తె రాజంపేటలో ఉండగా మరో కుమార్తె రైల్వేకోడూరులో ఉంటోంది. వడ్డిపల్లె అరుంధతివాడలో ఓ మహిళకు రమాదేవి కొంత నగదు అప్పుగా ఇచ్చింది. ఆమె పెనగలూరు మండలంలో ఉండడంతో వారం క్రితం ఆమె దగ్గరకు వెళుతుండగా ఒక యువకుడు పరిచయమయ్యాడు. ఆమె ఫోన్ నెంబరు తీసుకుని తన ఇంటికి, తన కుమార్తె ఇంటికి వస్తూ ఫోన్ చేస్తూ మీకున్న పొలానికి లోను ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో రమాదేవి బుధవారం సాయంత్రం ఆ యువకుడిని తన పొలం వద్దకు తీసుకెళ్లింది. అనంతరం పొలం దగ్గర ఉన్న తిప్పపైకి రమాదేవిని తీసుకెళ్లి కిందకు తోసేశాడు. అంతటితో ఆగకుండా ఆమె తలపైన, ఒళ్లంతా రాళ్లతో కొట్టడంతో ఆమె చంపేస్తాడేమోనని స్పృహ తప్పినట్లు పడిపోయింది. దీంతో ఆ యువకుడు ఆమె మెడలోని తాళిబొట్టు సరుడు, కమ్మలు లాక్కెళ్లినట్లు ఎస్ఐ వివరించారు. బంధువుల సహాయంతో ఆమె తిరుపతిలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో చికిత్స పొందుతోంది. ఆమె ఇచ్చిన ఫోన్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల కోసం సబ్సిడీ బియ్యాన్ని అందజేస్తుందని, దాన్ని అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు రవికుమార్ తెలిపారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ప్రభుత్వ బియ్యం తరలించకుండా పలు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టారు. డీలర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. రాజంపేట, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు ప్రాంతాల్లోని డీలర్లకు అధునాతనమైన 139 ఈ పాస్ యంత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. వీటివల్ల లబ్ధిదారులకు తలెత్తుతున్న ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

వై.కోటలో చిన్నారి మృతి



చందన (ఫైల్)

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై.కోట గ్రామానికి చెందిన అంకిపల్లి విజయ్, రాజేశ్వరి దంపతుల కుమార్తె చిన్నారి చందన (8) గురువారం మృతి చెందింది. గ్రామ పరిధిలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఈ చిన్నారి మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు గల్ఫ్‌కు వెళ్లడంతో పెద్దనాన్న వద్ద ఉంటోంది. రోజూలాగే ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లింది. అనంతరం ఏమైందో గానీ 10 గంటలకు వాంతులు చేసుకోగా గమనించిన ప్రధానోపాధ్యాయుడు మహదేవ సిబ్బందితో కలిసి చిన్నారి ఇంటికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అనంతరం పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చిన పాప పెద్దనాన్న రైల్వేకోడూరులోని ఓ ఆసుపత్రికి తరలించే క్రమంలో వైకోట బస్టాప్ వద్ద ఆ చిన్నారికి ఫిట్స్ వచ్చాయని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే కోడూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించి మెరుగైన వైద్య చికిత్స కొరకు తిరుపతికి తరలిస్తుండగా చిన్నారి మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భోరున విలపించారు. శుక్రవారం ఉదయం గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నట్లు తెలిసింది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నాగేంద్ర (ఫైల్)

రామాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కూలి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా... మండలంలోని రాచపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు చెందిన కుంచపు నాగేంద్ర (33) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఎక్కువై దిక్కుతోచని స్థితిలో బుధవారం పొద్దుపోయాక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి కుంచపు వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని శవపరీక్షకై రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, శవపరీక్ష అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య హితం



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న రైతులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యకరమని పోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ అన్నారు. గురువారం గుండ్లపల్లె రైతులతో కలిసి పోర్డు సంస్థ ప్రతినిధులు అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సహకారంతో కడప జిల్లా పొద్దుటూరు సమీపంలోని కల్లూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి సేద్యంతో పంటల సాగు, పెట్టుబడి, పండించిన పంటలు, జీవన ఎరువులు, జీవామృతంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి తదితర అంశాలపై సీఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డైరెక్టర్ ఆదినారాయణ, అభిషేక్, పవన్‌కుమార్, పోర్డు ప్రతినిధులు రమణ, సంపూర్ణ, హేమంత్, అనిత, నరసింహులు, రైతులు వేట మల్లికార్జున, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో చోరీ

- 13 తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీ

పెనగలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వినాయకనగర్‌లోని డేరంగుల జయమ్మ ఇంట్లో చోరీ జరిగి 13 తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్లు ఎస్ఐ బి.రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ చోరీ పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఎస్ఐ ఆధ్వర్యంలో రాయచోటి నుంచి వేలిముద్రల సేకరణ బృందం సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితురాలు జయమ్మ గత ఆదివారం కడపలోని తన సోదరి దగ్గరకు వెళ్లారు. బుధవారం సాయంత్రం తిరిగి పెనగలూరు వినాయకనగర్‌లోని ఇంటికి చేరుకోగానే ప్రధాన తలుపులు బార్ల తెరిచి ఉండడంతో హుటాహుటిన ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూం తలుపులు పగులగొట్టి ఉండడంతో కంగారుపడ్డారు. బీరువా వైపు చూడగా బీరువా తలుపులు కూడా పగులగొట్టి అందులోని బంగారు, నగదుతో పాటు వెండి గొలుసులు, పూజగదిలోని జత వెండి దీపాలు కూడా అపహరించుకు పోయినట్లు తెలిపారు. దోపిడీ జరిగినట్లు గుర్తించిన జయమ్మ హుటాహుటిన బంధువుల సహకారంతో పెనగలూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ ప్రజలకు సూచించారు. విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచుకుంటే భద్రంగా ఉంటుందన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన



ఆలయం వద్ద అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్, తదితరులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నగల్లు గ్రామంలో పురాతన చెన్నకేశవస్వామి జీర్ణోద్ధరణ పనులను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఇటీవల దేవదాయ రూ.40 లక్షలతో కొత్తగా ఆలయాన్ని నిర్మిస్తుండడంతో ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. కాగా గ్రామస్తులు ఆలయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయించి ఆలయాన్ని ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు చంద్రమోహన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమణ, కేశవ, వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వన్‌బీ అడంగల్‌ను పునరుద్ధరించాలి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దేవదాయ భూములకు సంబంధించి దేవుడి మాన్యం భూములకు వన్‌బీ అడంగల్‌ను పునరుద్ధరించాలని పెద్దతిప్పసముద్రం తహసీల్దార్‌ను అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ కోరారు. ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆలయ భూములకు సంబంధించి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయ భూములు 26.87 సెంట్ల భూమికి వన్‌బీ అడంగల్ ఇతరుల పేర్లతో నమోదయ్యాయని, వ్యక్తుల పేర్లను తొలగించి దేవుని గుడి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరడంతో దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తహసీల్దార్ ఆయనకు తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా ఎయిడ్స్ లెప్రసీ అధికారి రమేష్ అన్నారు. గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందితో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ కేసులు నమోదు చేసి రిజిస్ట్రేషన్ తప్పక చేయాలన్నారు. కళాశాలల్లో, హైరిస్క్ ప్రాంతాల్లో క్యాంపెయిన్ చేయాలన్నారు. ఐసీటీసీ, ఏఆర్టీ కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డేవిడ్ భాస్కర్, కౌన్సిలర్లు జయకుమార్, చంద్రమోహన్, పుల్లయ్య నాయుడు, దీప్తి, పాల్గొన్నారు.

భళా.. కళా ఉత్సవ్

డైట్ కేంద్రంలో ఘనంగా ప్రారంభమైన కళా ఉత్సవ్ పోటీలు





కార్యక్రమానికి హాజరైన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం



కళా ఉత్సవ్ పోటీల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని కళాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు ఉద్దేశించిన కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు గురువారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, కళల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు విద్యార్థులకు వేదికను అందించడం, ప్రాంతీయ స్థాయిలో కళలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, కథాకథనం పోటీల్లో 47 పాఠశాలల నుంచి 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతి విభాగంలో పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించారు. కళా ఉత్సవ్‌లో విద్యార్థులకు కళా నైపుణ్యాలకు సంబంధించి ఆరు విభాగాల్లో 12 అంశాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారిని జిల్లా స్థాయి కళాఉత్సవ్ విజేతలుగా ప్రకటిస్తామని కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం న్యాయ నిర్ణేతగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత ప్రముఖ రచయిత డాక్టర్ వేంపల్లి గంగాధర్ వ్యవహరించారు. ఈఅ సందర్భంగా బాలికలు చేసిన నృత్యం ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, కళాకారులు స్వతంత్ర బాబు, డైట్ అధ్యాపకులు, ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుకే...50 పడకల ఆసుపత్రి

- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యం అందక రోగుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో దుస్థితి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేరుకే అది 50 పడకల ఆసుపత్రి. ఇక్కడకు ప్రతి నిత్యం వందల మంది రోగులు వస్తుంటారు. అయితే డాక్టర్ల కొరత కారణంగా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి రోగులకు వైద్యసేవలు అందించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...

పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాలకు ప్రధాన కేంద్రం. ఈ మండలాల గ్రామీణ ప్రజలు వైద్యసేవలు పొందాలన్నా, చిన్న ప్రమాదం జరిగినా ముందుగా ఈ ఆసుపత్రిని ఆశ్రయిస్తారు. దీంతో ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా 30 పడకలతో ఉన్న ఆసుపత్రిని 2019లో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.3కోట్లు నిధులు వెచ్చించి భవనాలు నిర్మించి 50 పడకల ఆసుపత్రిగా మార్చి ఆధునిక పరికరాలన్నీ ఏర్పాటు చేసి 2023లో ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్ల నియామకం చేపట్టపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డాక్టర్ల కొరతతో ఇక్కట్లు

పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నిత్యం 200 నుంచి 300 మంది వివిధ రకాల వ్యాధిగ్రస్తులు ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. అయితే ఇక్కడ డాక్టర్ల కొరత తీవ్ర సమస్యగా మారింది. 12మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా మొన్నటి వరకు ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇటీవల మరో ఇద్దరు జాయిన్ కావడంతో ఆ సంఖ్య ఐదుగురికి చేరింది. ఇక గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, ఈఎన్టీ, మత్తు డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఉన్న డాక్టర్లు డెప్యుటేషన్‌పై వెళ్లడం, కొత్తవారు ఈ ప్రాంతానికి రావడానికి సుముఖంగా లేకపోవడం వైద్యుల కొరతకు కారణమైంది. ఇక ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతుండడంతో రక్త పరీక్షలకు వచ్చేవారు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందికరంగా ఉంది. అంతేకాక నైట్ సెక్యూరిటీ గార్డు పోస్టు నియామకం చేపట్టాల్సి ఉంది. ఇక ఆసుపత్రిలో అత్యవసర వేళల్లో రక్తం అందించడానికి బ్లడ్ స్టోరేజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక నెల నుంచి ఉపయోగంలో లేదని తెలిసింది. ఇందుకు సంబంధించి లైసెన్సు రెన్యువల్ కావాల్సి ఉంది. దీంతో ఈ నాలుగు మండలాలకు సంబంధించిన ప్రజలు వైద్య సేవలు అందక ఇబ్బందులకు గురవతున్నారు. దీనిపై గతంలో జిల్లాస్థాయి వైద్యశాఖా ధికారులు ఈ హాస్పిటల్‌ను తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు వైద్యుల నియామకం జరపాలని కోరారు. అలాగే సమస్యను ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్య వైద్యాశాఖాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి సక్రమంగా వైద్యసేవలు అందించాలని పోరుమామిళ్ల ప్రాంతవాసులు కోరుతున్నారు.



పోరుమామిళ్లలోని సామాజికఆరోగ్యకేంద్రం

వైద్యుల పోస్టులు భర్తీ చేస్తే...

తాను బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు అవుతుంది. ప్రస్తుతం ఉన్న డాక్టర్లతోనే వైద్యసేవలు అందిస్తున్నాం. ఖాళీగా ఉన్న పోస్టులకు వైద్యుల నియామకం జరిగితే పూర్తిస్థాయిలో సేవలందించేందుకు వీలుగా ఉంటుంది.

-నాగలక్ష్మి, సూపరింటెండెంట్,
పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం





రక్తపరీక్షల కోసం నిరీక్షిస్తున్న వ్యాధిగ్రస్తులు, వైద్యం కోసం వచ్చిన రోగుల అవస్థలు

కోడిగాండ్లపల్లెలో జ్వరాలపై
రిమ్స్ వైద్యుల బృందం ఆరా



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న రిమ్స్ రాపిడ్ రెస్పాన్స్‌టీం

ముద్దనూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కోడిగాండ్లపల్లెలో గురువారం రిమ్స్ మెడికల్ కాలేజీ రాపిడ్ రెస్పాన్స్ టీం పర్యటించింది. విషజ్వరాలతో బాధపడుతున్న బాధితుల ఇళ్ల వద్దకు రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, సామాజిక వైద్య విభాగం డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రొఫెసర్లు నవాజ్, ఖలీల్, కిశోర్‌రెడ్డి బృందం వెళ్లి పూర్తి వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బ్యాక్ వాటర్ వల్ల దోమలు విపరీతంగా వస్తున్నాయని బృందం సభ్యులకు వివరించారు. దీంతో గ్రామ సమీపంలో నిల్వ ఉన్న గండికోట బ్యాక్‌వాటర్‌ను బృందం పరిశీలించింది. అనంతరం మెడికల్ క్యాంప్ వద్ద ఆరోగ్య పరీక్షలు చేశారు. 35 మంది రక్తన మూనాలను సేకరించారు. ఎలిషా పరీక్ష కోసం డెంగ్యూ అనుమానిత ఐదుగురి రక్త నమూనాలను రిమ్స్‌కు తీసుకెళ్లారు. జ్వరాలు తగ్గేంత వరకు గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామని మెడికల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్‌యూనిట్ అధికారి లక్షుమయ్య, ముద్దనూరు, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చిలమకూరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్‌వాటర్, పారిశుధ్యంతోనే సమస్య

కోడిగాండ్లపల్లెలో డెంగ్యూ ప్రబలేందుకు గ్రామంలో పారిశుధ్య లోపం, ప్రధానంగా బ్యాక్‌వాటర్‌తో సమస్యగా ఉంది. గ్రామ సమీపంలో బ్యాక్ వాటర్ నిలిచి ఉన్నందున విపరీతంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దీంతో రాబోవు రోజుల్లో మరింత ప్రమాదకరమైన విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. రక్త నమూనాలను సేకరించి పరీక్షల అనంతరం పూర్తి నివేదిక జిల్లా అధికారులకు అందజేస్తాం.

-డాక్టర్ సురేష్‌రెడ్డి, రిమ్స్ వైద్యశాల సామాజిక వైద్య విభాగం, కడప

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు సంబంధించి నిర్వహించిన ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ జగన్నాథరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఇందులో ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్ విభాగాల క్రీడలలో ఉమ్మడి కడప జిల్లా నుంచి పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి వెల్లడించారు. ఇందులో అండర్-19 విభాగంలో ఎంపికైన బాలబాలికల వివరాలిలా...

బాలికల స్విమ్మింగ్ విభాగంలో...: ఎం.కుసుమ (వేము ల) పి.మంజు (సంబేపల్లి) ఎ.లావణ్య (వేముల) కె.కావ్య (సంబేపల్లి), కె.షీనా (చిన్నమండెం)

బాలుర స్విమ్మింగ్ విభాగంలో...: జి.అరవింద్‌కుమార్ (గాలివీడు), ఎ.దినేష్‌కుమార్ (కమలాపురం), టి.చిన్నగంగరాజు (రాజంపేట), ఎ.దినేష్‌కుమార్ (కమలాపురం), జె.వనిష్‌వర్ధన్ (సిద్దవటం), వై.వరణ్ (రామనపల్లి), జె.శ్రీశాంత్ (కడప), కె.కార్తీక్ (గాలివీడు) ఎ.ప్రకాష్ (గాలివీడు), పీవీ దస్తగిరి (లక్కీపేట), ఎస్.తిరుమలయ్య (రామనపల్లి), పి.సూర్యచరణ్‌తేజ (లక్కీపేట), జి.గణేష్‌రెడ్డి (సి.కె.దిన్నె), ఎస్.మాధవ (కమలాపురం), జి.కార్తీక్ (రామనపల్లి), కె.చెన్నయ్య (రాజంపేట), ఎస్.శ్రీహర్ష (రాజంపేట)

బాక్సింగ్ బాలుర విభాగంలో...: జె.వంశీవర్ధన్ (46కేజీ), జి.జయకృష్ణ (46 కేజీ), ఎస్.హుస్సేన్ (46-49 కేజీ), వి.రాధాకృష్ణ (49-52 కేజీ), కె.లోకేష్ (52-60కేజీ) ఎం.జయ ప్రకాష్ (60-64కేజీ), కె.వంశీ (91 కేజీ)



బాక్సింగ్‌లో ఎంపికైన బాలికలతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు

బాలికల విభాగంలో...: ఎస్.శిరీషా, ఎం.శృతి (45కేజీ) డి.లక్ష్మీప్రసన్న (45-48కేజీ) కె.నవ్య, పి.మంజు (48-51కేజీ) వి.కృష్ణకావ్య, డి.మహాలక్ష్మి (51-54కేజీ), ఎ.భువనేశ్వరి, వి.చైతన్యలక్ష్మి (54-57కేజీ) ఎన్.వెంకటేశ్వరి (57-60కేజీ) డి.యామిని (60-64కేజీ), వి.మోనిక (64-66కేజీ), ఓ.హిమశైలజ (69-75కేజీ)

మోడరన్ పాంథలాన్ బాలురు : ఎస్.తిరుమలయ్య (రామనపల్లి) సి.రామ్‌చరణ్ (కొత్త మాధవరం), కె.సంజయ్ (రాజంపేట), కె. చెన్నయ్య (రాజంపేట), ఎన్.శివసాయి (రామనపల్లి)

బాలికల విభాగంలో...: జి.నాగచరిత (రామాపురం) డి.మహాలక్ష్మి (రామాపురం), కె.కావ్య (సంబేపల్లి), ఎస్.నాగమణి (రామనపల్లి)

బంగారు గొలుసు దొంగ అరెస్టు

సీకేదిన్నె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడివీధిలో వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దొంగతనం చేసిన కాకర్ల ఆకాష్‌ను అరెస్టు చేసినట్లు సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. నందలూరు మండలం నల్లతిమ్మయ్యగారిపల్లెకు చెందిన ఎర్రగోళ్ల లక్షుమ్మ ఈనెల 9న అంగడివీధిలో నడుచుకుంటూ వెళుతుండగా ఆమె మెడలో ని 20 గ్రాముల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుపోయాడు. గురువారం నిందితుడి ఆచూకీ తెలుసుకుని సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.1.60 లక్షలు విలువచేసే బంగారు చైను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు ప్పవారిపల్లె గ్రామానికి చెందిన ఆకాష్ స్టూడెంట్‌గా చదువుకుంటూ వ్యసనాలకు బానిసయ్యాడు. ఇంటిలోని వారికి చెప్పకుండా అప్పులు చేసి వాటిని తీర్చేందుకు చెడుమార్గాన్ని ఎంచుకుని జైలుపాలైనట్లు సీఐ తెలిపారు.

వీధి కుక్కల దాడి... చిన్నారికి గాయాలు


కలసపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టైలర్ కాలనీలో గురువారం సాయంత్రం వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి ఇమ్రాన్ గాయపడ్డాడు. ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా తమబిడ్డపై దాడి చేశాయని తల్లిదండ్రులు మౌళాలి, వహీదాలు తెలిపారు. తాము దగ్గరలో లేకపోయింటే పిల్లాడి పరిస్థితి ఎలా ఉండేదో అని వాపోయారు. ఇమ్రాన్‌కు పోరుమామిళ్లలో చికిత్స చేయించినట్లు తెలిపారు. వీధికుక్కలను అదుపుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటి సామాగ్రి దగ్ధం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాధాక్రిష్ణనగర్‌కు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు, టీవీ, ఫ్రిజ్, ఏసీ తదితర పరికరాలు కాలిపోయాయి. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

కడప జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా సతీష్

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఉద్యానశాఖ అధికారిగా జి.సతీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా వున్న సతీష్. ప్రస్తుతం తిరుపతి ఏపీఎంఐపీ (సూక్ష్మ నీటిపారుదల) ప్రాజెక్ట్ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. పదోన్నతి కల్పించిన కారణంగా ఆయన్ను బదిలీ చేసి కడప ఉద్యానశాఖ డీడీగా తాత్కాలికంగా నియమించారు. కాగా ప్రస్తుతం ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా వున్న ఎం.వెంకటేశ్వరరెడ్డి కడప జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్నారు. ఆయనకు కూడా ఉద్యానశాఖలో డీడీగా పదోన్నతి కల్పించి డెప్యుటేషన్ పద్ధతిలో తిరిగి ఏపీఎంఐపీ పీడీగానే నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



సాయిబాబా స్కూల్‌కు జాతీయ గుర్తింపు



అవార్డు స్వీకరిస్తున్న సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ వివాంటా (ద్వారకా) 7 స్టార్ హోటల్‌లో జరిగిన సి-ఫోర్ స్కూల్ ఎక్సలెంట్ అవార్డ్ కార్యక్రమంలో సాయిబాబా హైస్కూల్ జాతీయ స్థాయిలో బెస్ట్ బడ్జెట్ స్కూల్స్ విభాగంలో 12వ ర్యాంక్ సాధించింది. ఈ అవార్డును మాజీ సీబీఐ డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్, ఐఏఎస్ అధికారి కె.శివప్రసాద్ చేతులమీదుగా సాయిబాబా విద్యాసంస్థల వైస్‌చైర్మన్ ఎంవీ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాల విజయాన్ని అభినందించి ఇంకా ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు.

భారీ స్కోర్ దిశగా కర్నూలు... నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య గురువారం నుండి జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్లు తలపడుతున్నాయి. ఇందులో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 57 ఓవర్లలో 3వికెట్లు మాత్రమే కోల్పోయి 222 పరుగులు చేసింది. ఇందులో ఎం. నయీముల్లా 107 పరుగులు చేయగా, సాయిగణేష్ 57 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లోనెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 407 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోషన్ పవన్ ఏకంగా 226 పరుగులతో , సుతేజ్‌రెడ్డి 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

'యోగి వేమన' స్టాండింగ్ కౌన్సెల్ రాజీనామా ఆమోదం

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్శిటీ స్టాండింగ్ కౌన్సెల్‌గా గతంలో నియమించిన టి.నిరంజన్ తన పదవికి చేసిన రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యూనివర్శిటీ తరపున ఆయన రాష్ట్ర హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్‌గా వ్యవహరిస్తున్నారు. అడ్వకేట్ జనరల్ సూచనల మేరకు నిరంజన్ రాజీనామాను తక్షణం అమల్లోకి వచ్చే విధంగా ఆమోదిస్తున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

చీనీ రైతులకు మంచి ధర కల్పించేందుకు కృషి



మార్కెట్‌యార్డులో చీనీ వ్యాపారంపై చర్చిస్తున్న ఆర్డీవో చిన్నయ్య

పులివెందుల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చీనీ రైతులకు మంచి ధర వచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. గురువారం పులివెందుల మార్కెట్ యార్డులో సాగుతున్న చీనీ వ్యాపారాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు, అధికారులతో మాట్లాడారు. రైతులు నష్టపోకుండా మంచి ధర వచ్చేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ ఎప్పటికప్పుడు ధరలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. ఇ-నామ్ మార్కెటింగ్ ద్వారా రైతులకు మెరుగైన ధర వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

14న సామూహిక ఉచిత పిండ ప్రదానం

కడప కల్చరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహాలయ పక్షాల సందర్భంగా పుష్పగిరి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ సన్నిధిలో ఉన్న రుద్రపాదం వద్ద ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు సామూహిక ఉచిత పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమౌళిశర్మ, వారణాసి శ్రీధర్‌శర్మ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పిండ ప్రదానంలో పాల్గొనదలచినవారు 2 పరాతాలు, 1 చెంబు, 2 గ్లాసులు, 1 చిన్నప్లేటు తమ వెంట తీసుకు రావాల్సి వుంటుందన్నారు. ఈనెల 13వ తేదీ శనివారం లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9866178032, 9515355815 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పారిశుధ్యం మెరుగుకు సత్వర చర్యలు

వేంపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్యం మెరుగుకు సత్వర చర్యలు తీసుకుంటామని ఈవో నాగభూషణంరెడ్డి తెలిపారు. వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శిగా ఉన్న ఆయనను వేంపల్లె ఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంతో పాటు తాగునీటి సరఫరాకు అధికప్రాధాన్యత ఇస్తామన్నారు. సిబ్బందికి త్వరలోనే వేతనాలు అందిస్తామని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

స్కూల్ బస్ ప్రమాదంపై విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కమలాపురం నియోజకవర్గం వల్లూరు మండల పరిధిలో జరిగిన స్కూల్ బస్ ప్రమాదంపై విచారణ చేపట్టాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డీఈవో కార్యాలయ ఆవరణంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందన్నారు. అలాగే స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ కూడా లేదని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో ఏడీ రామకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, ఎస్ఎండీ సాద్, నిర్మల్, హేమంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.చంద్ర, బత్తల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరు మాజీ సర్పంచ్ మృతి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వెల్లటూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కె.మస్తాన్ బీ (55) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. క్యాన్సర్ వ్యాధితో హైదరాబాద్‌లోని బసవరామ తారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఇటీవల సర్పంచ్ పదవికి చేశారు. చెర్లోపల్లె సర్పంచ్ గంగిరెడ్డి, మండలంలోని ఇతర ప్రజాప్రతినిధులు మస్తాన్‌బీ మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నారెడ్డి

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి సానుకూలంగా పరిష్కరించాలని పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జిల్లా పెన్షనర్ల సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించి అనేక బిల్లులు ప్రభుత్వం వద్ద పేరుకుపోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ వ్యాలిడేషన్, అమెండ్మెంట్‌ను తెచ్చారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 11వ పీఆర్సీ, అరియర్స్, ఈహెచ్ఎస్ క్యాష్‌లెష్ ట్రీట్మెంట్ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి నూనె నగేశ్, తుపాకుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఫోరం కన్వీనర్ తిరుపాల్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట 2003-డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ మేరకు తమ డిమాండ్ల సాధన కోసం కన్వీనర్లు తిరుపాల్, శోభారాణి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు కె.చెన్నయ్య, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, పీఎస్‌టీయూ, ఎస్‌టీఎఫ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడపసెవెన్ రోడ్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పింఛనర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పింఛనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసులు అన్నారు. స్థానిక పింఛనర్ల భవనంలో గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు పింఛనర్లపై, ఉద్యోగులపై సవతి తల్లి ప్రేమ కనబరచడం విచారకరమన్నారు. 11వ పీఆర్సీ, డీఆర్ అరియర్స్, వృద్ధులకు అవసరమైన ఈహెచ్ఎస్ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

తహసీల్దార్‌కు పెన్షనర్ల వినతి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాతపింఛన్‌ను పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ బండి నాగేశ్వరరెడ్డి, ఏపీఎన్జీవో పులివెందుల అధ్యక్షుడు జగన్నాథరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పులివెందుల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న సుమారు 11000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పింఛన్ పునరుద్ధరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివశంకర్, శ్రీనివాసులరెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, రాఘవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

నేడు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్)లో కనీసం 55 శాతం ఉత్తీర్ణత ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సీకే దిన్నె విద్యార్థులు

సీకేదిన్నె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు చింతకొమ్మదిన్నె జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ వేల్పుల నాగార్జునయ్య తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లాస్థాయి ఈత పోటీల్లో 10వ తరగతి విద్యార్థి ఇమ్రామన్ 50 మీటర్ల విభాగంలో ప్రథమస్థానం, 50 మీటర్ల బ్యాంక్, వంద మీటర్లలో తృతీయస్థానం, అలాగే గణేష్‌రెడ్డి 100 మీటర్ల విభాగంలో తృతీయ స్థానం, మౌలాలి 1500 మీటర్లలో ప్రథమస్థానం, 100 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో కపిల్ ద్వితీయస్థానం, హేమసాగర్ ప్రథమస్థానం, సుమంత్ బ్యాక్‌స్ట్రోక్‌లో ద్వితీయ స్థానం సాధించడం పట్ల హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గేట్, జీమ్యాట్ పరీక్షలపై అవగాహన

వేంపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యకు వెళ్లేందుకు గేట్, జీమ్యాట్, క్యాట్ పరీక్షలపై అవగాహన కల్పించారు. పోటీ పరీక్షల విభాగపు అధికారి కోనప్ప ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రశ్నలుంటాయి, మ్యాక్ పరీక్షల విధానం, ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల ఇళ్ల స్థలాలను కాపాడాలి



ధర్నా చేస్తున్న దళితులు

వేంపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే రోడ్డులో ఉన్న దళితుల ఇళ్లస్థలాలను కాపాడాలని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఇళ్లస్థలాలు కోల్పోతున్న వారికి న్యాయంగా రావాల్సిన పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపల్లె గ్రామ పొలంలోని 164, 165 సర్వేనెంబర్లలో 92 మంది దళితులు ఇళ్లస్థలాలు కలిగి ఉన్నామని, 1997లో కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నామని తెలిపారు. ఆ స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల పేర్లు పరిహారం జాబితాలో ఉన్నాయని, రికార్డులు పరిశీలించి అసలైన బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగన్న, రామాంజనమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందడం అభినందనీయం : ఎస్పీ



శ్రీనివాసరావును సన్మానించిన ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వృత్తిలో నిబద్ధత, అంకితభావం, నిజాయితీగా పోలీసుశాఖకు సేవలందించిన శ్రీనివాసరావు పదోన్నతి పొందడం అభినందనీయమని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ కొనియాడారు. ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు ఇటీవల పదోన్నతి పొంది ఏఆర్ అదనపు ఎస్పీగా ప్రకాశంజిల్లాకు పదోన్నతిపై వెళ్లిన సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తాను చూసిన టాప్‌టెన్ పోలీసు అధికారుల్లో శ్రీనివాసరావు ఒకరని, వృత్తి పట్ల ఆయన వైఖరి, అకుంఠిత దీక్ష ఎంతో ప్రశంసనీయమని, ఒక ఆల్‌రౌండర్‌గా విధులు నిర్వహించారన్నారు. సన్మాన గ్రహీత, ప్రకాశం జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎస్పీ ప్రోత్సాహం, సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఆర్ఐలు శివరాముడు, వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటస్, సోమశేఖర్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, స్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పోస్టుల భర్తీలో జరిగిన రూ.25 కోట్ల కుంభకోణంపై విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ 2024-25కు ఆర్‌సీఎం స్కూల్స్ యాజమాన్యం ప్రభుత్వ, హైకోర్టు ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో భర్తీకి అనుమతులు తెచ్చుకున్నారని, అయితే సరైన రోస్టర్ పాయింట్స్, రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ లేకుండా అప్పటి ఆర్జేడీ, డీఈవో, డిప్యూటీ డీఈవో స్కూల్ యాజమాన్యంతో కుమ్మక్కై వాటాలు పంచుకొని ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో నగర నాయకులు కార్తీక, శాత్‌నిర్మల్, ఆసిఫ్, రమేష్, చంద్ర, వంశీ, చిన్నకేశవులు, శివ తదితరులు పాల్గొన్నారు.

నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు ఊరుకోరు

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక వీడియో విడుదల చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు బావిలో పడి చావాలని మాట్లాడడం దారుణమన్నారు. కుప్పంలో ఎరువుల కొరత ఉందని ఒక ఫోటో చూపి మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో పూర్తి చేయాల్సిన మెడికల్ కళాశాలలను పూర్తిచేయకుండా వదిలేస్తే వాటిని చంద్రబాబునాయుడు అమలులోకి తెస్తున్నారన్నారు. సొంత మీడియా ఉందని ఏం మాట్లాడినా చెల్లుతుందని పీపీపీ విధానాన్ని తప్పుబడుతున్నారన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు

లింగాల,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని వెలిదండ్ల, రామాపురం, గుణకనపల్లె గ్రామాలలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా జ్వరాలు, విరేచనాలు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని పరీక్షలు వైద్యకేంద్రంలో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ ఛైర్మన్ వరప్రసాద్ డిమాండ్ చేశారు. 15 రోజుల్లోగా పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని తెలిపారు. ఈ మేరకు గురువారం నగర కమిషనర్ చాంబర్‌లో కమీషనర్ మనోజ్‌రెడ్డికి ముందస్తు సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రధానంగా నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాల పాటు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్, ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలకు ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు.

సీతారాం జీవితం.. ఆదర్శం

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను స్థానిక రామకృష్ణనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలోని వామపక్ష మేధావుల్లో సీతారాం ఏచూరి ఒకరని, ఆయన ఇవాళ మన మధ్య లేకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు, కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి

● సహాయ సంచాలకులు లక్ష్మీమాధవి

కడప రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాలలో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచి సకాలంలో అందించాలని కడప డివిజన్ సహాయ సంచాలకులు బి.లక్ష్మీమాధవి అన్నారు. గురువారం ఆమె ఏడీఏగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడుతూ యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎకరా వరి పైరుకు 75 కేజీల యూరియా సరిపోతుందన్నారు. ఇంతకు మించి వాడడం వలన ప్రయోజనం ఉండన్నారు. పంట వేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కడప ఏడీఏ పరిధిలోని ఖాజీపేట, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి, కడప, చింతకొమ్మదిన్నె మండలాల వ్యవసాయ అధికారులు సురేష్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణసుమంత్‌రెడ్డి, నాగార్జున, శ్రీదేవి, మంజుల, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాలు తీసుకొస్తేనే యూరియా

చెన్నూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం వచ్చే సమయంలో తమ వెంట కచ్చితంగా భూమి పాసుపుస్తకాలు తీసుకురావాలని, అలాంటి వారికి మాత్రమే యూరియా ఇస్తామని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని పలుప్రాంతాల్లో సాగైన వరిని పరిశీలించిన ఆమె ఎవరు ఎంత భూమిలో వరి సాగు చేశారన్న విషయాలన్నీ నమోదు చేసుకుని పంపిణీ చేపట్టారు. అలాగే వరిసాగు చేయని రైతులు యూరియా అడగవద్దని ఎవరి కోసమో యూరియా తీసుకెళ్లి పంట సాగు చేసే రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. భూములను ఇటుక బట్టీలకు, ఇతర అవసరాలకు లీజుకు ఇచ్చినవారు సైతం యూరియా అడగడం భావ్యం కాదన్నారు. చెన్నూరు గ్రోమోర్ సెంటరులో శుక్రవారం యూరియాను పంపిణీ చేస్తామని, అలాగే బయనపల్లె రైతులకు రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఎకరాకు వంద కిలోల యూరియా మూడు దఫాలుగా వేసుకోవాలని సూచించారు.

లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా జూనియర్ కలాశాలల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు ఇంటర్ విద్యకు దూరం అవుతున్నారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్లలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఎం.వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాన్ని వ్యతిరేకించడమే..

పులివెందుల రూరల్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం అంటే ఎన్టీఆర్ ఆశయాన్ని వ్యతిరేకించడమేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం పులివెందుల ప్రభుత్వ వైద్యకళాశాల వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ యాజమాన్యం ఎంబీబీఎస్ సీట్లను కోట్ల రూపాయలకు అమ్ముకుంటుందని, తద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. పులివెందుల వైద్యకళాశాలను ప్రైవేట్ పరం చేస్తూ జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బోనాల ఖాదర్, కళ్యాణ్‌రెడ్డి, నాగరాజు, చంద్రబాబు, రామకృష్ణ, రామాంజనేయులురెడ్డి, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. బ్రిటీష్ కాలం కంటే దారుణమైన పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. ప్రజలకు మేలు జరగాలన్న ఆలోచనలతో ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలను వైసీపీ ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే చంద్రబాబు మెడికల్ కలశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలయ్యాయంటూ సభ పెట్టడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పులి సునిల్‌కుమార్, షఫీ, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనం, కుటుంబం కోసం చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం పులివెందులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, సీడీఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్, సుఖవ్యాధులు, డ్రగ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధులు ఎలా సోకుతాయి, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్న అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ లేని సమాజం కోసం కృషి చేయాలి

కడప క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పాత్ర పోషించాలని వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నగరంలోని రాధాక్రిష్ణనగర్‌లో ఉన్న బాలుర సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నెం.3లో గురువారం విద్యార్థులకు డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం జిల్లా ఈగల్ బృందం, నార్కోటిక్ బృందం స్థానిక వన్‌టౌన్ పోలీసుఅధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి సమాజానికి దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రమేశ్‌బాబు, నార్కోటిక్ సెల్ ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ బృందం పాల్గొన్నారు.

'ఉన్నతి'తో విద్యార్థులకు ప్రయోజనం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కెరీర్ అభివృద్ధిలో యూఎన్‌ఎక్స్‌టీ ఉన్నతి కార్యక్రమం గణనీయ ప్రయోజనం చేకూరుస్తుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అన్నారు. గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖ ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ సహకారంతో ఎంబీఏ విద్యార్థుల కోసం 30రోజుల యూఎన్‌ఎక్స్‌టీ ఉన్నతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి, వృత్తిపరమైన నైపుణ్యాలను సమగ్రంగా పెంపొందించే లక్ష్యంతో 30రోజుల ఇంటెన్సివ్ ప్రయాణానికి నాందిపలికిందన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో సాఫ్ట్ స్కిల్స్ కీలకమన్నారు. ఈ చొరవ విద్యార్థుల వ్యక్తిత్వాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

జిల్లా ఆస్పత్రికి చికిత్స చేయాలి

- నర్సుల కొరత... రోగుల్లో కలత
- రీస్ట్రక్చరింగ్ పేరిట సిబ్బంది కుదింపు
- పెరిగిన పని భారం - లోపించిన నాణ్యత
- అన్నింటికి జీడీఏలపైనే ఆధారం
- కూటమి ప్రభుత్వంలోనూ తప్పని తిప్పలు


జ్వరపీడిత చిన్నారులకు సేవలు అందిస్తున్న స్టాఫ్ నర్సు
ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స లు చేయాల్సిన అవసరం ముంది. అత్యవసర విభాగంలో ఒక స్టాఫ్ నర్సు విధులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు అత్యవసర విభాగానికి సంబంధించిన వార్డు, జీఈ వార్డులను కూడా ఆమె పర్యవేక్షించాల్సి వస్తోంది. చిన్నపిల్లల వార్డులో ఒక స్టాఫ్ నర్సు డ్యూటీలో ఉండగా ప్రస్తుతం విజృంభిస్తున్న జ్వరాల తాకిడికి వార్డులో చిన్నపిల్లలతో కిటకిటలాడుతోంది. దీనికితోడు ఆ నర్సు ఎఫ్ఎం-1, ఎంఎం-2 వార్డుల బాధ్యత మీద పడటంతో అక్కడి రోగులను చూసుకోవాల్సి వస్తోంది. రోగులకు ఏదైనా సమస్య వస్తే అత్యవసర విభాగంలోని వైద్యులకు సమాచారం అందించడం, మందులు, రోగుల పర్యవేక్షణ, అరకొరగా ఉన్న సహాయక సిబ్బంది, పెరిగిన పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే అతి పెద్ద రెండవ పట్టణమైన ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకే కాక చుట్టూ ఉన్న ఎనిమిది మండలాలకు ఈవైద్యశాల పెద్దదిక్కుగా ఉంది. ఇక్కడ రోజుకు 1200 నుంచి 1400 వరకు ఓపీ నమోదు అవుతోంది. 350 పడకల సామర్థ్యం ఉంది. గతంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 72 మందికిపైగా స్టాఫ్‌నర్సులు ఉండేవారు. వైసీపీ హయాంలో రీస్ట్రక్చరింగ్ పేరుతో వైద్యుల, స్టాఫ్‌నర్సుల పోస్టులను కుదించారు. ఇందులో భాగంగా వీరి సంఖ్య 48కి పరిమితం అయింది. అందులో అయిదు ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం 43 మంది నర్సులు మూడు సిఫ్టులలో విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రతి సిఫ్టులో 14 మంది హాజరవుతున్నారు. ఆస్పత్రిలో సుమారు ప్రధానంగా 14 విభాగాలున్నాయి. ఒక్కో విభాగానికి సంబంధించి రెండు మూడు వార్డులు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాటి నుంచి ఇప్పటి వరకు అరకొర సిబ్బందితో సేవలు కొనసాగించాల్సి వస్తోంది. నర్సుల కొరత తీవ్రంగా వేధిస్తుండడంతో ఒక్కో నర్సు రెండు మూడు వార్డులను చూసుకోవాల్సి వస్తోంది. పగటి పూట ఎలాగోలా నెట్టుకొచ్చినా రాత్రి సమయాల్లో ఒక వార్డు నుంచి మరో వార్డుకు వెళ్లి సేవలు అందించాలంటే కష్టతరంగా మారుతుందని నర్సులు వాపోతున్నారు.

జీడీఏలపైనే ఆధారం

జిల్లా ఆస్పత్రిలో నర్సుల తర్వాత జనరల్ డ్యూటీ అటెండర్లదే(జీడీఏ) కీలకపాత్ర. ప్రస్తుతానికి 16 మంది జీడీఏలు ఉన్నారు. ఈ సంఖ్య కూడా ఆస్పత్రి స్థాయికి తక్కువే. సాధారణంగా జీడీఏలు వార్డుల్లో బెడ్‌మేకింగ్, రోగులకు కట్లు కట్టడం, ఫార్మసి నుంచి వార్డులకు కావాల్సిన మందులను తరలించడం వంటివి విధులు నిర్వహించాలి. వాటితోపాటు సిబ్బంది కొరత కారణంగా వీల్‌చైర్, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించడం, ఇంజక్షన్ లోడింగ్, సెలెన్ బాటిళ్ల మార్పు ఇలా అన్నింటికి జీడీఏలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఏమాత్రం అవగాహన లోపించినా రోగికి ఇబ్బందులు తప్పవనే విమర్శలున్నాయి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్ట్రక్చర్‌బాయ్ వ్యవస్థ కనిపించలేదు. వీల్‌చైర్, స్ట్రక్చర్ తదితర వాటిల్లో రోగులను ఒక చోటు నుంచి మరో చోటికి తరలించాలంటే రోగుల సహాయకులే ఆ పనులు చేసుకోవాల్సి వస్తోంది. సిబ్బంది కొరతపై ఇదివరకే ఆస్పత్రి ఉన్నతాధికారులు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా పరిస్థితుల్లో మార్పు కానరాక పనిబారం పెరిగి నాణ్యత లోపిస్తోంది. జిల్లా ఆస్పత్రి అడ్వైజరీ కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ ఇక్కడి పరిస్థితిపై దృష్టి సారించి తగిన సిబ్బందిని నియమించి నాణ్యమైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సూపరింటెండెంట్ ఏమంటున్నారంటే...

ఈ విషయమై జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్ మాట్లాడుతూ రీస్ట్రక్చరింగ్ పేరిట సిబ్బందిని కుదించిన మాట వాస్తవమేనని, దీంతో నర్సులపై పనిభారం పడుతుందన్నారు. ఉన్నవారితో రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మరో పది మంది స్టాఫ్ నర్సును నియమించాలని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించామని వారితోపాటు జీడీఏల సంఖ్య కూడా పెంచాలని కోరినట్లు వివరించారు.

నిరంతర శ్రామికులు ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భావితరానికి ఉత్తమ పౌరులను అందించే నిరంతర శ్రామికులు ఉపాధ్యాయులు అని ఎస్టీయూ రాష్ట అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్రసీపీఎస్ కమిటీ కన్వీనరు సుబ్ర మణ్యంలు అన్నారు. పోరుమామిళ్లలోని ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లను సన్మానించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు వెంకటేశ్వర్లు, ఎస్టీయు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి లేదని ఐసీడీఎస్ కార్యాలయం మార్పు

మైదుకూరు , సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం లక్షలు వెచ్చించి కట్టిన సొంత భవనాలు కాదని నెలకు రూ. 6వేలు అద్దె చెల్లించి ప్రైవేటు భవనంలోకి చాపాడు ఐసీడీఎస్ కార్యాలయంను మార్చారు. దువ్వూరు, చాపాడు, బ్రహ్మంగారిమఠం అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు సమావేశం నిర్వహించుకునేందుకు సరుకులు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ భవనంలో అన్ని సదుపాయాలుఉన్నా కేవలం మరుగుదొడ్డి లేదన్న కారణంగా అద్దెభవనంలోకి మారామని ఐసిడిఎస్ అధికారి సాకులు చెబుతూ కార్యాలయాన్ని మార్చడం ఏమిటని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆ కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత లేదు : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కౌన్సిల్ సమావేశం మంగళవారం జరుగకుండా అడ్డుకుని టీడీపీ కౌన్సిలర్లు, కమిషనర్ వెళ్లిపోయాక వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ హాల్లో ఉండి తిరిగి బుధవారం రెండవ రోజు జరిపించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత లేదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కౌన్సిలర్లు ఎవ్వరూ లేకుండా కేవలం వైసీపీ కౌన్సిలర్లు మాత్రమే ఉండి జరుపుకున్న సమావేశం చెల్లదన్నారు. కమిషనర్ ను సమావేశానికి రమ్మని బతిమాలి రప్పించుకొని పదేపదినిమిషాల్లో సమావేశం జరపడంపై ఎలాంటి చట్టబద్ధతలేదన్నారు. ఎగ్జిబిషన్ మైదానం లీజు టెండర్లకు జూలై, ఆగస్టు నెలల్లో ముందస్తు అనుమతి ఇవ్వకుండా తామే డీఎంఏ నుంచి ఎగ్జిబిషన్ వేలంకు అనుమతి తీసుకొచ్చి 12న టెండర్లను కూడా ఆహ్వానించామన్నారు. దీంతో వైసీపీ బుధవారం అజెండాలో ఎగ్జిబిషన్ మార్కెట్ లీజుకు వేలం పాటలు నిర్వహించాలని ఆమోదించడం కేవలం వారి తప్పిదం లేదని ప్రజలకు వెల్లడించడానికన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్‌ముక్తియార్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, శివాలయం మాజీ చైర్మన్ శంకర్ నారాయణలు పాల్గొన్నారు.



2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

బద్వేలు, సెప్టెంబరు 11, (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ మహా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా బద్వేలు తాలూకా కేంద్రం నుంచి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రి అందించారు. ఎన్‌జీవో అధ్యక్షుడు, నరసింహారెడ్డి, ఎస్టీ యూ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, రామచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కు మార్ పాల్గొన్నారు.

58 టన్నుల యూరియా మంజూరు


దువ్వూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి 58 టన్నుల యూరియా మంజూరైందని వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు 10 టన్నులు, పెద్దజొన్నవరంకు 10 టన్నులు, ఎర్రబల్లి, గోపులాపురం, బలక్కివారిపల్లెలకు 20 టన్నులు, మన గ్రోమోర్ సెంటర్‌కు 9 టన్నులు, ప్రైవేటు డీలర్లకు తొమ్మిది టన్నులు మంజూరైనట్లు చెప్పారు. శుక్రవారం నుంచి పంపిణీ జరుగుతుందన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

కాశినాయన సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డుకలిగిన ప్రతి కుటుంబానికి పనికల్పించాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభా భవనంలో ఆమె మాట్లాడుతూ సబ్సిడీ కింద పండ్లతోటలకు 105 ఎకరాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

9 మంది విద్యార్థులు ఎంపిక

చాపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెడ్మాస్టర్లు వెంకటలక్ష్మి, నరసింహశాస్త్రి, గోపీనాథ్‌లు పేర్కొన్నారు. ఈ ఆటలపోటీలను ఈనెల 10, 11 తేదీల్లో కడప,మైదుకూరు, పొద్దుటూరులలో జిల్లాస్థాయిలో అండర్-17, అండర్-14 విద్యార్థులకు నిర్వహించారు. త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం


వేపరాలలో జ్యోతులను ఎత్తుకున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

మైలవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామంలో వెలసిన తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరీదేవి అమ్మవారి జ్యోతి మహోత్సవాన్ని గురువారం అంతంత వైభవంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం రాత్రి ఇంటి వద్ద నుంచి జ్యోతులు ఎత్తుకుని పురవీధుల గుండా నృత్యాలు చేస్తూ పాటలు పాడుకుంటూ భక్తిశ్రద్ధలతో గురువారం ఉదయం చౌడేశ్వరీదేవి ఆలయం వద్దకు జ్యోతులను చేర్చారు. చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవాన్ని పురష్కరించుకని అమ్మవారిని, దేవాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి చౌడేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం గొడుగుల మహోత్సవ ఉంటుందన్నారు.

ఆర్యవైశ్య సభ ఎన్నికలపై కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు

ప్రొద్దుటూరు టౌన్,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సభ ఎన్నికలపై కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసిందని న్యాయవాది నాగరాజేష్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సభ ఎన్నికల్లో పలు అక్రమాలు జరిగాయని జిల్లా కోర్టుకు వెళ్లామన్నారు. దీంతో 2025-28 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గం ఎటువంటి ప్రచారంగానీ, ప్రచురణలు కానీ, సోషియల్ మీడియాలో కానీ, ఫొటోలనుగానీ ప్రచారం చేసుకోరాదని కోర్టు తీర్పు చెప్పిందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం మైదుకూరు మున్సిపాలిటీ ఏఈ నిరంజన్‌రెడ్డి, మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డిలకు సచివాలయం ఉద్యోగులు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయం ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో పనిఒత్తిడిని తగ్గించాలన్నారు.

మైదుకూరు పరపతి సంఘానికి ఎరువులు ఇవ్వండి

మైదుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు సిండికేట్ సహకార పరపతి సంఘానికి ఎరువులు అందించాలని రైతులు కోరుతున్నారు. యూరియా కొరతతో రైతులు సొసైటీ చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు తమ సొసైటీకి ఎరువులు కేటాయించాలని ఇండెంట్ పెట్టినప్పటికి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ సొసైటీకి ఎరువులు అందేలా చూడాలని మైదుకూరు సిండికేట్ రైతు సహకార పరపతి సంఘం చైర్మన్ పాశం మారుతీ ప్రసాద్, అధికారులు కోరుతున్నారు.

తెలుగువారిని స్వస్థలాలకు చేర్చడమే లోకేశ్ ధ్యేయం

జమ్మలమడుగు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగువారు ఆపదలో ఉన్నవారిని మంత్రి నారా లోకేశ్ స్వస్థలాలకు చేర్చడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ కృషితో నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజలు చేర్చడం కోసం పనులు చేస్తున్నారన్నారు. నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగువారు ఉన్నారని రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్ కంట్రోల్‌గా మార్చి సహాయక చర్యలను వేగవంతం చేశామన్నారు. ఆయన బాధితులతో మాట్లాడి ధైర్యంచెప్పారన్నారు. చిక్కుకున్నవారికి ఆహారం, వసతి సదుపాయాలు కల్పించేలా వెంటనే చర్యలు చేపట్టారన్నారు. నేపాల్‌లో జరుగుతున్న అల్లర్లలో 215 మంది ఉన్నారని, వారికి ఎలాంటి ఇబబ్బందులు కలుగకుండా స్వస్థలానికి చేర్చుతారని భూపేశ్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పెద్దముడియం టీడీపీ మండల నాయకులు శ్రీనివాసులరెడ్డి, బాలనాగిరెడ్డి, పుల్లారెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు

అనంతలో సూపర్-6 సభ డబుల్ హిట్

- ఓర్వలేకనే ఎమ్మెల్యే ఆదిపై విమర్శలు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంజిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిప సూపర్-6 సభ డబుల్ హిట్ అయిందని జమ్మలమడుగు మార్కెట్ యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఓర్వలేక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేయకపోయినా విమర్శలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో కేంద్రం నుంచి గండికోట అభివృద్ధికి టాస్కి నిధుల కింద దాదాపు రూ.80 కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించారన్నారు. అలాగే జమ్మలమడుగు చుట్టుపక్కల ప్రాంతాల్లో రోడ్లు వేయించారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డీకే కొండారెడ్డి, బిందు నాగేశ్వరరెడ్డి, కె.రఫి, నవనీశ్వరరెడ్డి, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

పెండింగులోని డీఏలు వెంటనే విడుదల చేయాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెండిం గ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చే యాలని కోరుతూ ఏపీటీ ఎఫ్ ఆధ్వంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిర సన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేటలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నెం.57ను తక్షణమే అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఈహెచ్ఎస్‌పరిమితిని రూ.25లక్షలకు పెంచాలన్నారు. ఏపీటీఎఫ్ నేతలు భూపాల్‌రెడ్డి, రామసుబ్బయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌తో సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అదాలత్ ద్వారా వినియోగదారుల సమస్య లు సత్వరం పరిష్కారమవుతా యని అదాలత్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలిపారు. గురువారం స్థానిక డివిజన్ విద్యుత్ కార్యాయలం ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదా లత్ నిర్వ హించారు. ఈ ఆదాలత్‌లో ఎర్రగుంట్ల నాగులకట్టవీధిలో లోవోల్టేజి సమస్య ఉందని ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరు పెన్నానగర్‌లో లోవోల్టేజీ సమ స్యతో ఇబ్బందులు పడుతున్నట్లు వినియోగదారులు పిర్యాదు చేశారు. ప్రొద్దుటూ రులో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని ముగ్గురు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఆర్థిక సాంకేతిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజ యలక్ష్మి, ఈఈ రమణారెడ్డి డీఈలు, ఏఈలు ఏఓలు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను ప్రోత్సహించాలి



పోరుమామిళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులను ప్రోత్సహించాలని కులవృత్తిలోకి అక్రమంగా ప్రవేశించే కార్పొరేట్ సంస్థలను నివా రించాలని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పోరుమామిళ్లలో నాయీబ్రాహ్మణులంతా తమ దుకాణాలన్నింటినీ మూసివేసి నిరసన తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీలో కొందరు అగ్రవర్ణాలకు చెందిన వారు నాయీబ్రాహ్మణుల కడుపులు కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దాదాపు 400మంది నాయీబ్రాహ్మణులు కుల వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని ఇలాంటి తరుణంలో ఇతర కులాల వారు సెలూన్‌షాపులు ఏర్పాటు చేసేందుకు యత్నాలు చేయడం మంచిదకాదన్నారు. సీఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించి పోరుమామిళ్లలో ర్యాలీ నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


నర్సింగపల్లెలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని నర్సింగపల్లె గ్రామంలో సర్వేనెం.622లో గుర్రాలబాట స్థలంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వభూమి. కడప నుంచి అమరావతి వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఆ స్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి బోరు వేసి నిర్మాణం చేపట్టారు. గురువారం ఈ విషయం తహసీల్దారు చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో ఓబయ్యలను పంపి నిర్మాణాలను నిలిపివేశారు. దాదాపు 34 సెంట్లలో ఈ నిర్మాణం చేపట్టారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గుర్రాలబాటను ఆక్రమించుకోకుండా హెచ్చరిక బోర్డు ఏర్పా టు చేసి ఆక్రమణలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దువ్వూరులో కుండపోత వర్షం

దువ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కుండపోతగా వర్షం పడింది. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఈ వర్షం వలన వరి, పసుపు పంటలకు ప్రయోజనం కలిగినా ఉల్లి రైతుల్లో ఆందోళన మొదలైంది. మండల పరిధిలోని కాలువల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంది. నీలాపురం-సుగాళితాండ మధ్యలో వాగు నిండుగా ప్రవహిస్తుండడంతో రాకపోక లకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 56.2 మి.మీ.లుగా వర్షపాతం నమోదు అయింది. లోతట్టు ప్రాంత పొలాల్లో సాగు చేసిన పంటలు మునకకు గురయ్యాయి.

ఏచూరి సీతారాం జీవితం ..ఆదర్శం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి జీవితం నేటితరానికి ఆదర్శమని సీపీఎం మండల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండలంలోని సుందరయ్యభవన్‌లో ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కమిటి సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆధ్యాత్మిక మార్గం.. ధ్యానం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక సాధనను మరింత బలంగా ముందుకు తీసుకుపోవాలంటే అద్వితీయమైన సాధన మార్గం ధ్యానం అని స్వామి తురియానంద సరస్వతి భక్తులకు ఉపదేశించారు. పట్టణంలోని రామక్రిష్ణసేవాసమితి ఆధ్వర్యంలో గత ఐదు రోజుల నుంచి భగవద్గీత సప్తాహ కార్యక్రమం జరుగుతుంది. గురువారం ధ్యానం ఫలితాల గురించి భక్తులకు వివరించారు.

నేడు ఇంటర్వ్యూలు

మైలవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 12వ తేదీ (శుక్రవారం) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. మైలవరంలోని వెలుగు కార్యాలయంలో కడప కొప్పర్తిలోని డిక్షన్ కంపెనీలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

